ఆదర్శ వివాహం చేస్తున్న నాయకులు

# పోస్టల్ బ్యాలెట్లే కీలకం

## - పలు ప్రాంతాల్లో గెలుపోటములు నిర్ణయించేది అవే - వాటితోనే ఓట్ల లెక్కింపు ప్రారంభం

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

**సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పోస్టల్ బ్యాలెట్లతోనే ప్రారంభం కానుంది. ఈ సారి ఎన్నికల్లో ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోస్టల్ బ్యాలెట్లు భారీగా పోలయ్యాయి. పలు ప్రాంతాల్లో ఆ ఓట్లు కీలకం కానున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గెలుపోటములను సైతం నిర్ణయించనున్నాయి...**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ తొలుత పోస్టల్ బ్యాలెట్లతోనే ప్రారంభం కానుంది. జూన్ 4న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించనుండగా పోస్టల్ బ్యాలెట్లను మొదట లెక్కించనున్నారు. ఈ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల పాటు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఈ సారి పోస్టల్ బ్యాలెట్లు పెద్ద సంఖ్యలో పోలయ్యాయి. కర్నూలు జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 19,344 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 17,661 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి 91.30 శాతం పోలింగ్ నమోదైంది. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 3,691 మందిలో 3,391 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో 1,822 మందికి గాను 1,730 మంది, కోడుమూరు నియోజకవర్గంలో 2,458 మందికి గాను 2,259 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 2,845 మందికి గాను 2,653 మంది, మంత్రాలయం నియోజకవర్గంలో 569 మందికి గాను 558 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఆదోని నియోజకవర్గంలో 2,067 మంది ఉద్యోగులకు గాను 1700 మంది, ఆలూరు నియోజకవర్గంలో 1,294 మంది ఉద్యోగులకు గాను 1,169 మంది, పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 4,598 మంది ఉద్యోగులకు గాను 4,201 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాల జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 25,283 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించి 14

టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఒక్కో టేబుల్‌కు 1,229 ఓట్లను లెక్కించనున్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి 17 టేబుళ్లలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. ఒక్కో టేబుల్‌కు 1,488 ఓట్లను లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పెద్ద సంఖ్యలో పోలైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఆ ఓట్లు కీలకం కానున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా అన్ని చోట్లా గట్టి పోటీ నెలకొంది. అతి తక్కువ మెజార్టీతో గెలుపొందే అవకాశాలున్న ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గెలుపోటములను నిర్ణయించనున్నాయి. ప్రధానంగా పార్లమెంట్ స్థానాలకు పోస్టల్ బ్యాలెట్లు ఎక్కువగా ఉండటంతో గెలుపోటములతో పాటు మెజార్టీలోనూ ఈ ఓట్లే కీలకం కానున్నాయి.

**పోస్టల్ బ్యాలెట్‌పై ఇసి కీలక ఆదేశాలు**

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ పేపరు వెనుక ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) సంతకమున్నా, సీల్ లేదని పోస్టల్ బ్యాలెట్ తిరస్కరించకూడదని స్పష్టం చేసింది. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌పైనా గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సీల్ లేకపోయినా సదరు బ్యాలెట్‌ను తిరస్కరించవద్దని పేర్కొంది. ఓటరు తమ ఓటును బ్యాలెట్ పేపరులో సక్రమంగా వేశారా? లేదా? అని మాత్రమే చూడాలని స్పష్టం చేసింది. దీనిపై ఆర్వోలు, కౌంటింగ్ సిబ్బంది, సూపర్ వైజర్లకు జిల్లా ఎన్నికల అధికారులు వెంటనే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అవసరమైతే శిక్షణా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్వో సంతకానికి, బ్యాలెట్ చెల్లుబాటుకు సంబంధం లేదన్నారు. పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సీల్ వేయడం ఆయన బాధ్యతేనని స్పష్టం చేశారు.

## సమాజ మార్పునకు
# కులాంతర వివాహాలే చోదకశక్తి

### - కెవిపిఎస్, ఆర్‌విఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

సమాజ మార్పుకు కులాంతర వివాహాలే చోదక శక్తిగా ఉపయోగపడతాయని, నిచ్చెన మెట్ల లాంటి భారత కుల వ్యవస్థను బద్దలు కొట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పైన ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సి. గురుశేఖర్ అధ్యక్షతన ఆదర్శ వివాహం జరిపించారు. కర్నూల్ నగరం కృష్ణారెడ్డి నగర్‌కు చెందిన చాకలి వినయ్, నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరం గ్రామానికి చెందిన రాచపోగుల ఎరిషలతో సాంప్రదాయ ఆచారాలకు భిన్నంగా ఆదర్శ వివాహానికి సంబందించిన ప్రమాణ పత్రాలను కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు వారితో చదివించి దండలు మార్పించి పెళ్లి తంతు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలోనే ఉందని, దాన్ని బద్దలు కొట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందనిభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య లాంటివారు కోరుకున్నారన్నారు. భారత సమాజం కులాల వారిగా విభజించబడి, అంతరాలతో కునారిల్లుతోందన్నారు. ఈ అంతరాల దొంతరలను తొలగించేందుకు కంచం పొత్తు, మంచం పొత్తే దోహద పడతాయని కోరుకున్న అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడంలో భాగంగా ఆదర్శ వివాహం చేసుకుంటున్న నూతన దంపతులకు, కులాన్ని అధిగమించి తమ పిల్లలకు ఆదర్శ వివాహం జరుపుతున్న తల్లిదండ్రులకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదర్శ వివాహ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి నరసింహ, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. రంగప్ప, ఎస్.అబ్దుల్లా కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్‌జి.కృష్ణ, ఆంధ్రా గురుస్వామి, గిత్తరి రమేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, రాముడు, శేషాద్రి, జయమ్మ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సి.సాయి ఉదయ్ హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పెళ్లి కుమారుడు వినయ్ తల్లిదండ్రులు ఉరుకుందమ్మ, తిప్పన్న, అన్న వీరేష్, పెళ్లి కుమార్తె ఎరీష తల్లిదండ్రులు దీవమ్మ, క్రిస్టఫర్, మేనమామ లక్ష్మణ్ కుమార్, తాత బజారయ్య, పెద్దలు మద్దిలేటి, రవిశంకర్ పాల్గొన్నారు.

## కర్నూలు కళాకారులకు
# ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాలు

**ప్రజాశక్తి,-కర్నూలు కల్చరల్**

కర్నూలుకు చెందిన హనుమంతరాయ చౌదరి, బైలుప్పల షఫీయుల్లాలకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన తెలుగువారి ఆత్మగౌరవం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 102వ జయంతి సందర్భంగా భారతీయ సాహిత్య ఫౌండేషన్ వారిచే ఈనెల 28న హైదరాబాద్ నగరం సుందరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బిక్కీ కృష్ణ తెలిపినట్లు కర్నూలు జిల్లా రంగస్థల కళా సేవకులు అవార్డుకు ఎంపికైన బైలుప్పల షఫీయుల్లా తెలిపారు. షఫీవుల్లా కర్నూలు జిల్లా నందు దాదాపు 30 సంవత్సరాలుగా సమాజ సేవ, కళా రంగంలో రాష్ట్ర స్థాయిలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వికలాంగుల, మహిళల, బాలల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, జంతు సంక్షేమం, విద్య, వైద్య సేవలు, జిల్లా రంగస్థల విశిష్ట సమాజ సేవచేస్తున్నారు. హనుమంతరావు చౌదరి కళా రంగంలో గత 40 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారు. టిడిపి సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా వున్నారు. నటులుగా దుర్యోధన పాత్రను 300 సార్లు ప్రదర్శించి రికార్డు నెలకొల్పారు. 1997 నుంచి 2019 వరకు ప్రతి సంవత్సరం నందమూరి తారక రామారావు పేరున ఏకపాత్ర పోటీలు నిర్వహించి జిల్లాస్థాయిలో.. రాష్ట్రస్థాయిలో.. ఎందరో



కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రజల హృదయాలలో నిలిచిన నందమూరి తారక రామారావు స్ఫూర్తిని కొనసాగించినందుకు గుర్తింపుగా రంగస్థలం కళాకారులైన ఈ ఇద్దరికీ పురస్కారం రావడం అభినందనీయమని కర్నూలు కళాకారులు పార్వతయ్య, అంకయ్య లు తెలిపారు. జాతీయ అవార్డు వచ్చినందుకు.. కళారంగానికి రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.

# కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయండి

**- జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన సంబంధిత

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి సృజన

అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఈవిఎమ్ యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాల్‌ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఎక్కువ సమయం పడుతుందని అందుకు గాను రాయలసీమ యూనివర్సిటీలోని పార్కింగ్ ప్రదేశంలో, యూనివర్సిటీ మొత్తం అదనపు లైటింగ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి ఎస్ఈని ఆదేశించారు. మొబైల్ డిపాజిట్ సెంటర్‌లలో మొబైల్ డిపాజిట్ చేయించుకున్న అనంతరం సంబంధిత వారికి టోకెన్ ఇచ్చే విధంగా టోకెన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని డ్వామా పిడిని ఆదేశించారు. కౌంటింగ్ మెటీరియల్ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు హ్యాండోవర్ చేశారా? లేదా ? అని డ్వామా పిడి ని కలెక్టర్ ఆరా తీశారు. మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్, త్రాగు నీరు, ఏజెంట్ ఐడెంటిఫికేషన్ కౌంటర్ ఏర్పాట్ల పనులు ఎంతవరకు వచ్చాయని సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ నాగబాబు, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ నాగరాజు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రిటర్నింగ్ అధికారి, జెసి నారపురెడ్డి మౌర్య తెలిపారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని పాణ్యం నియోజకవర్గా నికి సంబంధించి ఇంజనీరింగ్ బ్లాక్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను, కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, 26 రౌండ్లతో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా కౌంటింగ్ కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు అనుమతి ఉండదన్నారు. కల్లూరు తహశీల్దార్ మునివేలు, ఆర్అండ్‌బి డిఈ భారతి ఉన్నారు.

పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి

మెడికవర్ హాస్పిటల్‌లో వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

## అత్యవసర సమయంలో జాగ్రత్తలపై అవగాహన

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా కర్నూల్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం అత్యవసర వైద్యులు, ప్రజలకు అత్యవసర సమయంలో తీసుకోవలసినపై జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమర్జెన్సీ విభాగం హెచ్ఓడి డాక్టర్ సునీల్ యాదవ్, క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆకస్మిక గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, సెప్సిస్ పాలీట్రామా అనేది ఎవరికైనా మొదటి గంటలో జరిగే చికిత్స గోల్డెన్ అవర్ సమయంలో ఎంత త్వరగా పేషెంట్‌ని హాస్పిటల్ కి తీసుకోని వేళ్తే చాలా మంది బ్రతికే అవకాశం ఉంటుందన్నారు. అలా చాలా మంది ప్రాణాలను రక్షించగలమన్నారు. ఎవరైనా అడ్మిట్ అయినట్లయితే వారి ఆసుపత్రి బస తక్కువగా ఉంటుందని,వారికి సరైన వైద్యం అందటం వల్ల వారు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ ఆరోగ్య సంరక్షణ అవగాహన, భద్రత, సంసిద్ధత యొక్క సంస్కృతిని ప్రోత్సహించడానికి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్, డాక్టర్ వైష్ణవి, డాక్టర్ రఘునాద్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ భరత్ డాక్టర్ రామ్ పవన్, డాక్టర్. కళ్యాణ్ మరియు డాక్టర్. వినోద్ పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయానికి పుస్తకాలు వితరణ

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యాలయానికి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ సోమవారం పుస్తకాలను అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా ఆధ్వర్యంలో పుస్తకాలను ఇచ్చారు. అనంతరం కెంగార మోహన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, యువకులు పుస్తకాలకు సమయాన్ని కేటాయించడంలేదని, మొబైల్‌కి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని సమాజంలో జరిగే విషయాలను తెలుకోవటం లేదన్నారు. ఎప్పుడైతే విద్యార్థులు, యువకులు పుస్తకాలు చదువుతారో అప్పుడే వారికి ప్రపంచం తెలుస్తుందని, చాలా మంది నాయకులు, తత్వవేత్త, నిరంతరం అధ్యాయం చేయటం వల్లనే వారిని ప్రపంచం గుర్తిస్తుందని అన్నారు. అందుకనే ప్రతి ఒక్కరూ నిరంతరం అధ్యయనం చేయాలి అన్నారు. జిల్లా కార్యాలయానికి 41 పుస్తకాలు ఇచ్చిన మోహన్‌కు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్షులు అమర్, తదితరులు పాల్గొన్నారు

పుస్తకాలను అందజేస్తున్న కెంగారమోహన్

# ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను చంపుతున్న కేంద్రం

### -'దేశం కార్పొరేట్లకు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

**ప్రజాశక్తి -కర్నూల్ కల్చరల్**

చతీస్ ఘడ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో కార్పొరేట్లకు ఆదివాసీలను ప్రభుత్వం చంపుతుందని వక్తలు అన్నారు. సోమవారం ఎస్‌టియు భవన్‌లో 'దేశం కార్పొరేట్లకు' అనే పుస్తకావిష్కరణ ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. రామకృష్ణారెడ్డి కన్వీనర్ గా 'దేశం కార్పొరేట్లకు' పుస్తకావిష్కరణను భార్గవ(పిఒపి)ఆవిష్కరించారు. వక్తలుగా జహంగీర్(ఎస్‌పిఐ), రామకృష్ణారెడ్డి(సిపిఐ), అల్లాబకష్(సిఎల్‌సి), పాణి(విరసం)లు ప్రసంగించారు. చత్తీస్‌ఘడ్ ఆదివాసులను ప్రభుత్వం వరుసపెట్టి చంపేస్తోందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి దాకా 120 మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారని ఇందులో ఆరు నెలల పసిపాప ఉందన్నారు. పన్నెండేళ్ల బాలిక కూడా ఉందన్నారు. దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన రకరకాల సైనిక బలగాలు బస్తర్ అడవుల్లోకి వచ్చి ఈ హత్యలు చేశారన్నారు. ఈ దారుణం మీద కేంద్ర హోంమంత్రి అమిత్ ఆనందంగా ఒక ప్రకటన చేసి దానిని 'భారతదేశంలో అభివృద్ధికి మావోయిస్టులు అతి పెద్ద అడ్డంకిగా మారిపోయారని త్వరలోనే మావోయిస్టులందరినీ చంపేస్తాం' అనడం దుర్మార్గమన్నారు.'ఈ ఎన్నికల్లో బిజెపికి మరోసారి అధికారం ఇవ్వండి రెండేళ్లలో మావోయిస్టులను తుడిచి పెట్టేస్తాం' అని ప్రకటించడం దుస్సహాసమన్నారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసినా బిజెపి మాత్రం తమకు మళ్లీ అధికారం ఇస్తే మావోయిస్టులందరినీ చంపేస్తాం అంటోందన్నారు. ఆదివాసులందరినీ నిర్మూలిస్తా అంటోందన్నారు. ఇట్లా చంపేసే పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ అనే పేరు పెట్టిందన్నారు. కగార్ అంటే అంతిమ యుద్ధం అని అర్థం అన్నారు. రాజ్యాంగబద్ధంగా పాలించాల్సిన ప్రభుత్వం ఈ దేశ ప్రజలను చంపేస్తానని ఎందుకు అంటోంది? భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన జీవించే హక్కును కాలరాస్తాం అంటోంది? ఎందుకు ఇలా అంటోంది? ఒకసారి

దేశం కార్పొరేట్లకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఆలోచించాలాన్నారు. చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఆంధ్రా తెలంగాణాల మధ్య ఉన్న సువిశాల ఆదివాసీ ప్రాంతాల్లో లెక్కించడం సాధ్యం కానంత విలువైన సహజ వనరులు ఉన్నాయని, అవి ఈ దేశ ప్రజలవి, మనందరివి అన్నారు. అక్కడ జీవిస్తున్న ఆదివాసులవి కాదా అని ప్రశ్నించారు. మన అభివృద్ధికి ఉపయోగపడాల్సిన అడవులు మన పర్యావరణాన్ని కాపాడేవాటిని, వీటన్నిటినీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాని, అంబాని వంటి కార్పొరేట్ సంస్థలకు రాసి ఇచ్చారన్నారు. వాటిని తవ్వుకొని పోవడానికి కార్పొరేట్లు అడవిలోకి వెళుతున్నారని అక్కడ ఉన్న ఆదివాసులు దీన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారన్నారు. కార్పొరేట్ల తరపున భారత ప్రభుత్వం సైన్యాన్ని దించి అణచివేస్తున్నదన్నారు. భారత ప్రజల మీదే భారత ప్రభుత్వం లక్షల సైన్యాన్ని ఉసిగొల్పిందని డ్రోన్లతో, హెలికాప్టర్లతో దాడులు చేస్తున్నదన్నారు. ఈ యుద్ధానికి గతంలో ఆపరేషన్ సమాధాన్ అనే పేరు పెట్టారన్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ అనే పేరు పెట్టారన్నారు. ఆపరేషన్ కగార్ కేవలం ఆదివాసులను చంపేయడానికొక్కటే కాదని మావోయిస్టులను నిర్మూలించడానికొక్కటే కాదని ఈదేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు భారత ప్రభుత్వం మనందరి మీద ఈ అంతిమ యుద్ధాన్ని ప్రకటించిందన్నారు. మరి మనం దీన్ని వ్యతిరేకించాలా లేదా? అని వక్తలన్నారు.

# పత్తి విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు

### - విత్తన కంపెనీలతో వ్యవసాయ శాఖ జెడి

**ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్**

జిల్లాలో పత్తి విత్తనాల కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి, కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో విత్తన కంపెనీ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ పత్తి విత్తన కంపెనీలైన నూజివీడు, కావేరి ,యూఎస్ అగ్రి సైన్స్, మహికో, వేద, సింజంట, నాథ్ మొదలగు కంపెనీల యొక్క ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యంగా పత్తి విత్తనాల యొక్క కృత్రిమ కొరతను సృష్టించకుండా కంపెనీ ప్రతినిధులు రోజువారి అమ్మకపు వివరాలు, ప్రొడక్షన్ ప్లాన్ ప్రకారం విత్తనాల సరఫరా మొదలగునవి తూచా తప్పకుండా పాటించాలని, లేనిచో అట్టి కంపెనీలపై విత్తన చట్ట ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, అంతేకాకుండా గరిష్ట అమ్మకపు ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించినచో అట్టివారిపై చర్యలకు వెనుకాడబోమని జిల్లా వ్యవసాయ అధికారి కంపెనీ ప్రతినిధులకు హెచ్చరించారు.

విత్తన కంపెనీల వారితో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి వరలక్ష్మి

నెహ్రూ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న డిసిసి అధ్యక్షులు బాబురావు, తదితరులు

## నెహ్రూకు ఘనంగా నివాళులు

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

మాజీ ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ 60వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక డిసిసి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు కే బాబురావు ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబురావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను ప్రధాన మంత్రిగా ఎన్నుకున్నారని, ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. నెహ్రూ మంచి పరిపాలనా దక్షుడని, ఆగర్భ శ్రీమంతుడయినా నిరాడంబరుడని, స్వాతంత్ర్య ఉద్యమంలో జైలు జీవితం గడిపారని, నెహ్రూ మంచి రచయితగా, పండితుడుగా, చరిత్రకారుడిగా భారతదేశ రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కర్నూలు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ జిలానీ భాష, డిసిసి గౌరవాధ్యక్షులు వెంకటన్న, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పీజీ నరసింహులు యాదవ్, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం, కె సత్యనారాయణ గుప్త, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్ పాల్గొన్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న అధికారులు

## మెనూపై వంట నిర్వాహకులతో సమీక్ష

**ప్రజాశక్తి-సి బెళగల్**

పాఠశాలలో 2024-25 మధ్యాహ్న భోజనం పకడ్బందీగా నిర్వహించేందుకు వంట నిర్వాహకులతో ఎంఇఒలు ఆడమ్ బాషా, జ్యోతిలు సోమవారం సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిల్లలకు సక్రమంగా మెనూ అందించి నాణ్యమైన వంటలను వడ్డించాలని అన్నారు. ఎవరైనా నిర్వాహకులు అతిక్రమిస్తే తక్షణమే నిర్వాహకులను తొలగించడం జరుగుతోందని వారు సమీక్షలో హెచ్చరించారు.

## కౌంటింగ్ సిబ్బంది

# ముందు రోజే హాజరు కావాలి

**- ఎన్నికల అధికారి శివ నారాయణ శర్మ**

**ప్రజాశక్తి - ఆదోని**

జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది ముందు రోజు (3న) రాయలసీమ యూనివర్సిటీలో హాజరు కావాలని ఆదోని ఎన్నికల అధికారి, ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదోని నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు, టేబుళ్లకు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శివ నారాయణ శర్మ

కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌కు అనుమతి లేదన్నారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుళ్లు, 19 రౌండ్ల కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఓటింగ్ లెక్కింపు జరుగుతుందని, తర్వాత ఈవిఎం మిషన్ల కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. ఈవిఎం మిషన్ల కౌంటింగ్ పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం ఈవిఎం మిషన్స్ సీలింగ్ చేసి భద్రపరుస్తామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ విధులను అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలన్నారు. నిబంధన ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై శాఖ పరమైన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, కార్యాలయపు పరిపాలన అధికారి శేషయ్య, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ విజయ శేఖర రావు, డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, డిప్యూటీ తహశీల్దార్లు రామేశ్వర్ రెడ్డి, వీరభద్ర గౌడ్, వలీబాష, దీప, వినీత్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమానికి హాజరయిన సిబ్బంది

# చినుకు పడితే చిత్తడే...

**- మున్సిపల్ కార్యాలయం బురదమయం**
**- మురుగుతో అపరిశుభ్రత**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో వర్షం విస్తారంగా కురిసింది. వర్షం కురిసిన ప్రతిసారీ పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. మురుగు కాలువలు పొంగిపొర్లడం వల్ల మురుగునీరు పల్లపు ప్రాంతాల్లో నిలిచి ఆ పరిసరాలు అంతా అపరిశుభ్రంగా మారుతున్న పరిస్థితి ఉంది. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణం, పాతబస్టాండ్ మైదానం, తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణం, కోర్టు ఆవరణం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణం బురద మయంగా మారి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తరాలు మారినా పరిస్థితి మెరుగు పడడం లేదంటూ పురవాసులు వాపోతున్నారు.

**మున్సిపల్ కార్యాలయం ముందు చిత్తడి**

ఆదోని పట్టణంలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించే మున్సిపల్ కార్యాలయం చిత్తడిలోనే ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా మున్సిపల్ మెయిన్ రోడ్డు నుంచి గేటు మీదుగా పల్లపు ప్రాంతంలో ఉండే మున్సిపల్ కార్యాలయం ఆవరణ ముందు నీరు నిలుస్తోంది. అదేవిధంగా ప్రధాన గేట్ వద్ద కూడా మురుగునీరు నిలవడం వల్ల కార్యాలయంలోకి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. నీటిని పాదాలకు తడుపుకొని లోపలికి రావాల్సిందే అంటూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. నిర్మాణం మొదట్లోనే అప్పటి ఇంజినీర్లు కనీసం డ్రెయినేజీ సదుపాయం కూడా కల్పించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ప్రజా సమస్యలపై మాట్లాడే కౌన్సిలర్లు కనీసం కార్యాలయం పరిసరాల అపరిశుభ్రత గురించి మాట్లాడకపోవడం విచారకరమని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మురుగునీరు నిలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పుర వాసులు కోరుతున్నారు.

**డివిజన్‌లో 143.4 మిమీ వర్షపాతం నమోదు**

సోమవారం ఆదోని డివిజన్ మొత్తం 143.4, సగటు 15.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదోని 28.6, ఎమ్మిగనూరు 30.6, పెద్దకడబూరు 8.4, గోనెగండ్ల 22.6, మంత్రాలయం 20.8, నందవరం 14.2, కోసిగి 13.4, కౌతాళం, 4.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం ముందు ఆగిన వర్షపు నీరు

కార్యాలయం గేటు ముందు నిలిచిన నీరు

### పరిసరాలను శుభ్రం చేయించాలి

**- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి**

వర్షం కురిసిన ప్రతిసారీ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎక్కువ రోజులు నీరు నిలుస్తూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పారిశుధ్య కార్మికుల చేత నీటిని తోడి పరిసరాలు శుభ్రం చేయించాలి. కార్యాలయ ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా కాలువ ఏర్పాటు చేయించాలి. ఎక్కువ రోజులు నీరు నిలవడం వల్ల కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

### సమస్య పరిష్కారానికి చర్యలు

**- వెంకట చలపతి రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్**

కార్యాలయం పల్లపు ప్రాంతంలో ఉండడం వల్ల వర్షం కురిసిన నేపథ్యంలో ఆవరణలో నీరు నిలుస్తోంది. ఎక్కువ రోజులు నిలవకుండా తోడి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చేయిస్తున్నాం. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరిం చాం. ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

## ఎన్‌టిఆర్ జయంతిని విజయవంతం చేయండి

**- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య**

**ప్రజాశక్తి - కౌతాళం**

స్థానిక టిడిపి కొత్త కార్యాలయంలో చేపడుతున్న ఎన్‌టిఆర్ జయంతిని విజయ వంతం చేయాలని టిడిపి సీని యర్ నాయకులు ఉల్లిగయ్య కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. తెలుగు జాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు ఆశయాలను మరువరాదన్నారు. అలాంటి మహా యుగపురుషుడు ఎన్‌టి.రామారావు జయంతికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

**మహారాజ శ్రీ ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జికోర్టులో**

**I.A.No.94/2022 in OS 6/2022**

1) బి.శివానంద రెడ్డి
2) బి.వి.దినేష్ రెడ్డి. ...వాదులు

**Vs**

1) శ్రీమతి బూశిరెడ్డి రాధిక,
భర్త బి.శివారెడ్డి,
ప్లాట్ నెం.31, ఇంటి నెం.87/138-ఎం.హెచ్.31,
మణికంఠ హౌమ్స్, గ్రౌండ్ ఫ్లోర్, జోహరాపురం,
కర్నూలు టౌన్ & జిల్లా.
2) బి.శివారెడ్డి. ...ప్రతివాదులు

**1వ ప్రతివాదికి దావా సమను**

పై నెంబరు దావాను వాదులు పర్మినెంట్ ఇంజక్షన్ నిమిత్తం మరియు దావా నిమిత్తం దాఖలు చేయమని శ్రీ కోర్టువారు 1వ ప్రతివాదికి ఎన్నిమార్లు సమన్లు, నోటీసుఅ పంపినను అందుకోనందున ఈ ప్రకటన ద్వారా మీకు సమన్లు, నోటీసులు జారిచేసి యున్నారు. కావను మీరు తేది.18.06.2024వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై తెల్పిన కోర్టులో హాజరై వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల నీ పలరోక్షమందు విచారించి తీర్మానించబడునని యిందుమూలముగా నీకు తెలియజేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)**

**వాయిదా తేది : 18-06-2024**

**డి.ఎల్లారెడ్డి**, MA, BL
**టి. మల్లికార్జున రెడ్డి**, BCom, BL
వాదిపరం అడ్వకేట్స్,
నందికోట్కూరు,
నంద్యాల జిల్లా.
సెల్ : 9440092111

## 2,250 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ

**- ఎఒ సురేష్ బాబు**

**ప్రజాశక్తి- దేవనకొండ**

మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 2,250 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు ఎఒ సురేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. మండలంలోని కరివేముల, దేవనకొండ గ్రామాల్లో ఆర్‌బికెల ద్వారా వేరుశనగ విత్తనాల పంపిణీ, విత్తన, ఎరువు దుకాణాలను తనిఖీ చేశామని తెలిపారు. విత్తన దుకాణాల ద్వారా సేకరించిన పత్తి, ఆముదం, కంది విత్తనాలను నాణ్యత పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపామన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ నుంచి వేరుశనగ విత్తనాలు 2,365 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. ఈఏడాది వేరుశెనగ పంట సాగు విస్తీర్ణం పెరుగుతుందని చెప్పారు. ఇంకా 850 క్వింటాళ్ల విత్తనం అదనంగా కేటాయించాలని జిల్లా అధికారులకు నివేదికను పంపినట్లు తెలిపారు. విత్తనాలు కొన్న ప్రతి రైతూ తప్పకుండా విత్తన దుకాణదారుల నుంచి బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎఇఒలు జయరాం, రంగన్న, యోగి పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రంలో సామరస్యంగా ఉండాలి

**- ఆర్ఒ రాము నాయక్**

**ప్రజాశక్తి - ఆలూరు**

జూన్ 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్లు సామరస్యంగా ఉండాలని ఆలూరు నియోజకవర్గ ఆర్ఒ రాము నాయక్ తెలిపారు. సోమవారం ఆలూరు తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఆర్ఒ రాము నాయక్, డీఎస్పీ శ్రీనివాసులు, ఆలూరు తహశీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీలో జరిగే ఆలూరు నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ కేంద్రానికి 4న ఉదయం 6 గంటలకు అభ్యర్థి లేదా కౌంటింగ్ ఏజెంట్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్, ఇటిబిఎస్, కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు మొత్తం 16 మంది హాజరు కావాలని తెలిపారు. 7 గంటలకు స్ట్రాంగ్ రూముకు ఎవరు వచ్చినా, రాకపోయినా వచ్చిన వారి ముందు స్ట్రాంగ్ రూము తెరుస్తారని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు పెన్, పేపర్, సెల్ ఫోన్లు తీసుకు రాకూడదన్నారు. అభ్యర్థులకు, ఏజెంట్లకు టిఫిన్, భోజన వసతి అధికార యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు సోదరభావంతో మసలుకొని కౌంటింగ్ సిబ్బందికి సహకరించి పూర్తయ్యేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అల్లర్లకు పాల్పడితే, అలాంటి వారిని గుర్తించి తక్షణమే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపే అవకాశాలున్నాయని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. డిటి రజనీకాంత్ రెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఓబులేసు, ఆర్ఐ బసవన్న గౌడ్, పార్టీల నాయకులు వీరభద్ర గౌడ్, నవీన్ కిషోర్, విరుపాక్షి తనయుడు చంద్రశేఖర్, షేక్షావలీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఒ రాము నాయక్

## పూలచింత చెరువు కట్టపై

# తెల్లమట్టి అక్రమ రవాణా

**- అవసరమున్నది కొందరికి - మాటున భారీగా పక్కదారి**
**- ఒక్కో ట్రిప్ రూ.800 నుంచి రూ.1500 అమ్మకం**
**- రోజుకు 60 నుంచి 80 ట్రిప్పుల తరలింపు**
**- అధికారుల కళ్లుగప్పి సొమ్ములు చేసుకుంటున్న బడాబాబులు**

**ప్రజాశక్తి - నందవరం**

**మండలంలోని పూలచింత కట్టపై తెల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కొంతమందికి అవసరం ఉంటే వారి మాటున భారీగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్ రూ.800 నుంచి రూ.1500 విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం.**

సామాన్యుల పట్టా భూమిలో మట్టి తీసి తరలించాలన్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అనుమతి తప్పనిసరి. అలాంటిది నిబంధనలను తుంగలో తొక్కి, ఏకంగా ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా తెల్ల మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు ప్రజలకు అవసరమని చెప్పి, మరోవైపు ప్రయివేట్ వ్యక్తులకు గరుసును అమ్ముకుని బడాబాబులు జేబులు నింపుకుంటున్నారు. నందవరం పరిధిలోని కేవలం ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న నందవరం, గంగవరం రోడ్డు పక్కనే పూలచింత చెరువు ఉంది. చెరువు కట్ట కింద చెరువుకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో ప్రయివేట్ నిర్మాణాలకు అవసరమైన తెల్లమట్టిని జెసిబిల సహాయంతో తరలిస్తున్నారు. రోజుకు 15 ట్రాక్టర్లతో దాదాపు 60 నుంచి 80 ట్రిప్పుల తెల్ల మట్టి (గరుసు)ను తరలించుకుపోతున్నారు. అది కూడా సామాన్యులకు అందుబాటులోని ధరలతో. ఒక్కో ట్రిప్పు గరుసును రూ.800 నుంచి రూ.1500లకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే కొన్ని ప్రయివేట్ సంస్థలకు 50 నుంచి 100 ట్రిప్పుల వరకు గరుసును ముందస్తుగా బుక్ చేసుకొని ఒక్కో ట్రిప్పును రూ.800 చొప్పున అమ్ముకుంటున్నారు. సహజ వనరులు అక్రమంగా తరలిపోవడం, ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన సొమ్ము అందకుండా పోతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు చివరి భాగంలో ఉండే కడుకొమ్మ పక్కనే తెల్ల మట్టిని తరలిస్తున్నారు. పెద్ద వర్షం వచ్చి చెరువు నిండితే కరకట్ట తెగిపోయే ప్రమాదం లేక పోలేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారుల కళ్లుగప్పి బడాబాబులు తెల్లమట్టి అక్రమ రవాణా ఎలా వ్యాపారం చేసుకుంటున్నారని ప్రజలు అవాక్కవుతున్నారు. తెల్లమట్టి తరలింపులో అధికారుల పాత్ర ఉందా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తెల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

జెసిబితో ట్రాక్టర్‌కు తెల్ల మట్టిని వేస్తున్న దృశ్యం

**BEFORE THE HOUNOURABLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR), AT KURNOOL**
**DISPUTE NO. 81/2023**

BETWEEN:
M/S Margadarsi Chits Funds Pvt Ltd., Kurnool. … DISPUTANT

-Vs-

Gonegandla Imran Ali & others … OPPONENTS

**అపోనెంట్స్ 1 నుండి 4 గురికి కోర్టు నోటీసు**

1. Gonegandla Imran Ali S/o G.Yusuf, W/as, Junior Asst.,O/O A.A.O/E.R.O.Rural, A.P.S.P.D.C Ltd,Nandyal Dist, Now R/o H.No. 91-4-9-2-2,Balaji Nagar, Kurnool.
2. Boya Siva Chiranjeevi S/o B.Ramakrishna, W/as.Junior Asst.,O/O A.A.O/E.E.(O) Division, A.P.S.P.D.C Ltd,Adoni,Kurnool Dist. Now R/o 21/136,S.K.D.Colony Zero Road, Near Sai Degree College, Adoni(p),Kurnool Dist.
3. Syed Sarthaz Basha S/o S.Md. Rahamathullah, W/as. Junior Asst.,O/O A.A.O/E.E.(O)Division, A.P.S.P.D.C Ltd,Pattikonda(p),Kurnool Dist, Now R/o LIG-II,A.P.H.B Colony, Adoni(p), Kurnool dist.
4. Boya Charan Kumar S/o B.Maheswarudu, W/as.Junior Asst.(General Section)O/O S.E.(O) Circle Office, A.P.S.P.D.C Ltd,noonepalli, Nandyal Dist, Now R/o H.No. 1-49, Devamada village, Kurnool(m) Kurnool Dist.

పై దావా నందు డిస్‌ప్యూట్ కంపెని వారు వారికి రావలసిన బాకీ మొత్తము రూ.1,23,110/- అసలు మరియు ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీపైన దావా దాఖలు చేసినారు. ఇందులో 1 నుండి 4 వరకు అపోనెంట్స్ అయిన మీరు తేది.06-06-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరుకాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైన అభ్యంతరములు వున్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**కోర్టు వారి ఉత్తర్వుల మేరకు**

**తేది : 06-06-2024**

**BY ORDER OFTHE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: KURNOOL**

# మళ్లీ జగనే ముఖ్యమంత్రి

**- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి మంత్రి వర్గంలో చోటు దొరకడం ఖాయమని సర్పంచి భీమయ్య ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రావాలని, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మంత్రి పదవి దక్కాలని ఆకాంక్షిస్తూ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ఎపిలో కూటమి గల్లంతు అవుతుందని జోస్యం చెప్పారు. జూన్ 9న రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరంలో ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 2009, 2014, 2019 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నాలుగోసారి కూడా అత్యధిక మెజార్టీతో విజయం సాధించి రికార్డు సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి మంత్రి వర్గంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి మంత్రి పదవి వరించాలని ఆకాంక్షించారు. స్థానిక పాత ఊరులో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, వెంకటేశ్వర స్వామి, గ్రామ దేవత మంచాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందిందంటే ఆ ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని కొనియాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను కూడా టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, వై.ప్రదీప్ రెడ్డి, వై.ధరణీ రెడ్డి, వైసిపి నాయకులు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి నేతృత్వంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, సచివాలయ మండల కో కన్వీనర్ వికెసి రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచి భీమయ్య

# ఘనంగా నెహ్రూ వర్ధంతి

**ప్రజాశక్తి ఆదోని**

ఆధునిక నవభారత నిర్మాత, స్వాతంత్ర్య సమరయోధులు, భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆదోనిలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ యాదవ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం కోసం కాంగ్రెస్ నాయకులు ఎందరో ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. వారిలో నెహ్రూ కుటుంబం మొదటిదన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పోరాడి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, రామకృష్ణా రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేశ్, మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, నిసార్ అహ్మద్, తాయన్న, వంశీ, జయన్న పాల్గొన్నారు. **కోసిగి**లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీకృష్ణ రాజు దొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ దొర, శ్యాంప్రసాద్, కె.ఉలిగయ్య, పి.తాయన్న, కార్యకర్తలు గోవిందు, లక్ష్మయ్య, పీరయ్య, హనుమంతు, కోసిగయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఆదోనిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కోసిగిలో...

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

## సామరస్యంగా ఉండాలి

**- డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి**

**ప్రజాశక్తి - హాలహర్వి**

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వరకు ప్రశాంత వాతావరణంలో ఉండాలని, నాయకులు, ఏజెంట్లు సామరస్యంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం హాలహర్వి పోలీసు స్టేషన్‌లో కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యర్థులు, నాయకులు, ఏజెంట్లు సోదరభావంతో మసలుకొని కౌంటింగ్ సిబ్బందికి సహకరించి పూర్తయ్యేలా చూడాలన్నారు. మండలంలో అల్లర్లకు పాల్పడితే అలాంటి వారిని గుర్తించి తక్షణమే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపే అవకాశాలున్నాయని హెచ్చరించారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

# విత్తనాలు, పంట రుణాలివ్వాలి

**- సిపిఐ, రైతుసంఘం నాయకులు**

**ప్రజాశక్తి- దేవనకొండ**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని, అలాగే బ్యాంకులో ఎలాంటి షరతులూ లేకుండా రుణాలు ఇవ్వాలని సిపిఐ, రైతుసంఘం నాయకులు కోరారు. సోమవారం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.తిమ్మయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసరావు మాట్లాడారు. గతేడాది తీవ్రమైన కరువుతో రైతులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే నామమాత్ర సబ్సిడీ కాకుండా సబ్సిడీని 90 శాతానికి పెంచాలని కోరారు. అలాగే గత ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు పంటల బీమా సొమ్ము ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. ప్రతి రైతుకూ ఎలాంటి షరతులూ లేకుండా రూ.5 లక్షల పంట రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు కండప్ప, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు రామాంజనేయులు, నాగరాజు, రవి, శ్రీనివాసులు, కోదండ, రామాంజి, బాష, రంగస్వామి, భాస్కర్, మహ్మద్, అనుమప్ప, చంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.చిన్నన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు కెసి.జబ్బర్, సమీవుల్లా, ఇస్మాయిల్, ఖాజా, హనుమంతు, వీరేష్, నరసింహులు, సుంకన్న, రామాంజనేయులు, నరసప్ప, అజారుద్దీన్ పాల్గొన్నారు. **కోసిగి** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు హెచ్.మూకప్ప అధ్యక్షత వహించారు. సిపిఐ మండల కార్యదర్శి, రైతుసంఘం తాలూకా అధ్యక్షులు ఎం.గోపాల్ మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేయలేదని తెలిపారు. పంట రుణాలు ఇవ్వడం ప్రారంభించలేదన్నారు. ఇప్పటికే మండలంలో వర్షాలు కురుస్తున్నాయని, రైతుల దగ్గర విత్తనాలు లేవని తెలిపారు. విత్తనాలు కొనడానికి డబ్బులు లేవని, 90 శాతం రాయితీతో అన్ని రకాలు విత్తనాలు అవసరమైన మేరకు ఇవ్వాలని కోరారు. సిద్ధప్ప, నరసింహులు, భీమయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

దేవనకొండలో ఆర్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోసిగిలో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR) ANANTAPURAMU.**
**DISPUTE No. DRA/CFS/58/2023.**

**Between:**
KAPIL CHITS HYDERABAD PVT.LTD., Anantapuamu Represented by its Legal Officer,
**… DISPUTANT**

**AND**

V.LINGANNA BABU & 2 Others
**… OPPONENTS**

**NOTICE TO OPPONENTS No.3**

Op.3. B.Pavan Kumar, S/O.Anjineyulu, Hindu, A/A.29 Years, Is Working As Private Employee, D/No.1-34, Putakalamarri, Allaridinne (P), Muthukur (M), Kurnool (D).

Where as the Disputant Chit Fund Company, in the above Dispute has instituted the above Dispute for recovery of money for Rs.13,376/- and the same is posted for your appearance in the said Court on the 19-06-2024 by 11:00 a.m. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

**(By Order of Deputy Registrar of chits O/o of the District Registrar, Registration and Stamps Dept. D.No.6-3-134, Ist Floor, Ram Nagar, Anantapuramu)**

**BEFORE THE HOUNOURABLE DEPUTY REGISTRAR OF CHITS (O/o DISTRICT REGISTRAR), AT KURNOOL**
**DISPUTE NO. 84/2023**

BETWEEN:
M/S Margadarsi Chits Funds Pvt Ltd., Kurnool. …DISPUTANT

**-Vs-**

Harivaram Dastagiri & others. …OPPONENTS

**అపోనెంట్స్ 1 నుండి 6 గురికి కోర్టు నోటీసు**

1. Harivaram Dastagiri S/o H. Mohaboob Saheb, w/as, S.G.Teacher, Moinuddin Siddiqu Aided UP. school, (U &T Medium),Sirivella (a) Nandyal Dist. H.No.29/332-19-E, Tekke, Near MPL. High school, Nandyal Dist.
2. Harivaram Mohaboob Basha S/o. H.Mynuddin, w/as, Police constable, P.C.No.463,H.Q, O/O Commandant,2nd Battalion, Q.No. S-7-655, A.P.S.P,Quarters,A.P.S.P.Camp,Kurnool,
3. Syed Zaheed Basha s/o S. Khadar Basha, w/as, S.G.Teacher (T ), Khaleel Siddiqu Aided High school, Nunepalli, Nandyal Dist., H.No.2-12-33, N.G.O's Colony, Banaganapalli (p), Nandyal Dist.
4. Bodanam Jvala Chinna Narasimhulu S/o B.C. Narasimuhulu, w/as Police Constable, P.C.No.824, H.Q.O/O. Commandant, 2nd Battalion, Q.No. S-7- 650, A.P.S.P,Quarters, A.P.S.P.Camp, Kurnool,
5. Harivaram Shashavali S/o. H.Mynuddin, w/as, Police constable. P.C.No.906,D.Camp,H.Q, O/O Commandant,2nd Battalion, Q.No. S-1-15,A-18-5-E,Rajeev Nagar, Bellary Road, Kurnool,
6. Reddy Salam Basha S/o R.Hussain Saheb, W/as S.G.Teacher (T), Siddiqu Aided ElE school, (U &T Medium), Nunepalli, Nandyal Dist., H.No.28/768-A,4-9C,Lalitha Nagar, N.G.O's Colony, Nandyal Dist.

పై దావా నందు డిస్‌ప్యూట్ కంపెని వారు వారికి రావలసిన బాకీ మొత్తము రూ.5,57,340/- అసలు మరియు ఖర్చులు వడ్డీ రాబట్టుకొనుటకు గాను మీపైన దావా దాఖలు చేసినారు. ఇందులో 1 నుండి 6 వరకు అపోనెంట్స్ అయిన మీరు తేది.06-06-2024 వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వద్ద హాజరుకాగలరు. మీరుకాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైన అభ్యంతరములు వున్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**కోర్టు వారి ఉత్తర్వుల మేరకు**

**తేది : 06-06-2024**

**BY ORDER OFTHE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: KURNOOL**